
సాక్షి
గుంటూరు
శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



కావురమ్మకు ప్రత్యేక పూజలు

రేపల్లె రూరల్: చెరుకుపల్లి మండలం కావూరులోని కావురమ్మ తల్లి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ ఈవూరి గణేష్ ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.60 అడుగుల వద్ద ఉంది. ఇది 139.6134 టీఎంసీలకు సమానం.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: గణపవరం-నాదెండ్ల డొంకరోడ్డులోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం నాలుగో వార్షికోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు.

న్యూస్‌రీల్

ఐఎఫ్‌సీ బృందం క్షేత్ర సందర్శన



అమరావతి: మండలంలోని పలు గ్రామాలలో గురువారం అంతర్జాతీయ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) ప్రతినిధుల బృందం రైతులతో వ్యవసాయ క్షేత్ర సందర్శన, గ్రామసభలు నిర్వహించారు. తొలుత ఈ బృందం దిడుగు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి మిర్చి రైతులను మిర్చి ఉత్పత్తి, మార్కెటింగ్ గురించి అడిగి తెలుసుకున్నారు అత్తలూరులో నిర్వహించిన వ్యవసాయక్షేత్ర సందర్శనలో మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. అనంతరం స్వయం సహాయక మహిళాసంఘాల సభ్యులు, రైతులతో ఆర్థిక అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌సీ బృంద సభ్యులు కె. విజయశేఖర్, హేమేంద్ర మెహర్, యువరాజ్ అహూజా, నవనీత్‌రాయ్, షెనాయ్ మ్యాథ్యు, ఇషాసర్, సీతల్ సోమనిలతో పాటు ఉద్యానవన శాఖ డీపీఎం అమలకుమారి, మండల, వ్యవసాయశాఖాధికారి అహ్మద్, ఉద్యాన అధికారి శ్రీనిత్య, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన నగర కమిషనర్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు తీసుకున్న బి.సాయి కళ్యాణ్ చక్రవర్తిని గురువారం జిల్లా కోర్టులోని ఆయన కార్యాలయంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కొండపాటూరు పోలేరమ్మకు రూ. 22.46 లక్షల ఆదాయం



ప్రత్తిపాడు: కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మకు తిరునాళ్ల సందర్భంగా రూ. 22.46 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో బత్తుల సురేష్‌బాబు తెలిపారు. భక్తులు పోలేరమ్మ తల్లికి సమర్పించిన కానుకలు, హుండీలను తెరిచి ఆలయంలో గురువారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పాటల ద్వారా రూ. 3.90 లక్షలు, హుండీల ద్వారా 12.76 లక్షలు, టిక్కెట్ల ద్వారా 2.40 లక్షలు, చందాల రూపంలో రూ. 39 వేలు, లడ్డూ ప్రసాద విక్రయాల ద్వారా రూ. 3 లక్షలు చొప్పున మొత్తం 22,46,256 రూపాయల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. లెక్కింపు కార్యక్రమాన్ని దేవదాయశాఖ బాపట్ల ఇన్‌స్పెక్టర్ ఎం.గోపి, ఈవో బి. సురేష్‌లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి మువ్వా రామచంద్రావు, గ్రామపెద్దలు యర్రాకుల దానయ్య, పి. శ్రీనివాసరావు, ఉత్సవకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి కౌన్సిల్ సమావేశం వాయిదా

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): ఈ నెల 25వ తేదీన జరగాల్సిన నగర పాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. ఈ నెల 28న మేయర్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఈ సమావేశాన్ని వాయిదా వేసినట్టు తెలిసింది.

యువకుడి వేధింపులు.. వివాహిత ఆత్మహత్య

తెనాలిరూరల్: యువకుడి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు గుడివాడ గ్రామానికి చెందిన వివాహిత కామంచి ఆమని(34)ని అదే గ్రామానికి చెందిన పాలపర్తి మహేష్ ప్రేమిస్తున్నానంటూ వెంటపడే వాడు. ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. ఈ నేపథ్యంలో ఆమె ఈ నెల 4వ తేదీన పోలీసులను ఆశ్రయించగా 22వ తేదీన నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. 23వ తేదీన బెయిలు రావడంతో గ్రామానికి వెళ్లిన మహేష్ తనను పోలీసులు ఏం చేయలేక పోయారని, ఆమె అంతు తేలుస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన బాధితురాలిని కుటుంబ సభ్యులు పొన్నూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్‌ఐ కె. ఆనంద్ తెలిపారు.

కూటమి ఓవర్ యాక్షన్

ఫ్లయ్ ఓవర్‌కు మంగళం.. ఆర్‌ఓబీతోనే సరి !

- భవిష్యత్ అవసరాలకు సరిపోని డిజైన్
- శంకర్‌విలాస్ ఫ్లయ్ ఓవర్‌పై వివాదం
- 2018లో రూ.168 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు
- నేడు సేతుబంధన్ ప్రాజెక్టు కింద రూ.98 కోట్లతో సరి
- వ్యతిరేకిస్తున్న గుంటూరు నగరవాసులు
- అడ్డుకుంటే పొక్లయిన్లు వస్తాయంటూ ఎమ్మెల్యే బెదిరింపులు



సాక్షి ప్రతినిధి,గుంటూరు: గుంటూరు నగరానికి ఐకానిక్‌గా మారాల్సిన శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్‌ను కూటమి నాయకులు చిన్న బ్రిడ్జిగా మార్చివేయడం వివాదంగా మారుతోంది. ప్రభుత్వంలో ఉన్నాం. మేం చెప్పినట్లే చేయాలి. మా ఆలోచనలే అమలు కావాలంటూ మొండిగా ముందుకెళుతుండడం ఆందోళన కలిగిస్తుంది. పైగా అడ్డుకుంటే పొక్లెయిన్లు వస్తాయంటూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బెదిరింపులకు దిగుతున్నారు. గతంలో గల్లా జయదేవ్ ఎంపీగా ఉన్నప్పుడు, తాజాగా ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక కూడా ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తామని, అండర్ బ్రిడ్జి కూడా ఉంటుందని ప్రకటించి, ఇప్పుడు కేవలం చిన్న బ్రిడ్జికి పరిమితం చేశారు.

తూర్పు, పశ్చిమలకు అనుసంధానం..

శంకర్ విలాస్ సెంటర్ బ్రిడ్జిని 1960లో నిర్మించారు. అప్పుడు గుంటూరులో చాలా తక్కువ జనాభా. ప్రస్తుతం గుంటూరు నగర జనాభా 11లక్షలకు చేరింది. రోజూ శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ మీదుగా లక్ష వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఎప్పుడో ఆరు దశబ్దాల క్రితం నిర్మించి ఈ బ్రిడ్జి కేవలం రెండు వరుసలు మాత్రమే. గుంటూరులో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య ఎక్కువవుతుంది. దాదాపు 30వేలకు పైగా ఆటోలున్నాయి. స్కూల్, కాలేజీ, యూనివర్సిటీ బస్సులు వెయ్యివరకూ ఉన్నాయి. ఇక కార్లు, టూవీలర్స్ అయితే చెప్పనక్కర్లేదు. అయితే ఎప్పటినుంచో పెరుగుతున్న ట్రాఫిక్ అవసరాలకు అనుగుణంగా శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ ఉంది. ప్రధానంగా శంకర్ విలాస్ ఫ్లయ్ ఓవర్ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉంటుంది.

బిల్డప్ కోసం జనం బలి!

2014లో గుంటూరు ఎంపీగా గెలిచిన గల్లా జయదేవ్ వద్ద శంకర్ విలాస్ బ్రిడ్జి స్థానంలో కొత్తది నిర్మించాలని జనం డిమాండ్ గట్టిగా వినిపించారు. దీంతో జయదేవ్ 2017లో పాత బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్న ప్రతిపాదన తీసుకొచ్చారు. సింగిల్ పిల్లర్‌తో ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం జరిగేలా డిజైన్ చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.167కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అంబేద్కర్ సెంటర్ నుంచి హిందూ కాలేజీ సెంటర్ వరకూ 1.46 కి.మీ బ్రిడ్జి నిర్మించాలని డిజైన్ చేశారు. అయితే ఆ ప్రతిపాదన కాగితాలకే పరిమితమయ్యింది. వైఎస్సార్ సీపీ పాలనలో శంకరవిలాస్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి డీపీఆర్ కూడా కేంద్రానికి పంపారు. నిధులు మంజూరయ్యే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సేతుబంధన్ పథకం కింద కేంద్రం శంకర్ విలాస్ బ్రిడ్జికి రూ.98కోట్లు మాత్రమే మంజూరు చేసింది. వాస్తవానికి 2017లోనే బ్రిడ్జి నిర్మాణానికి రూ.167కోట్లు ఖర్చు అవుతుందని అంచనావేస్తే పెరిగిన రేట్లకు అనుగుణంగా ఇప్పుడు దాదాపు రూ.200కోట్లు ఖర్చు అవుతుంది. కానీ గుంటూరు ఎంపీ పెమ్మసాని తామేదో చేసేస్తున్నామని బిల్డప్ ఇవ్వడానికి సేతుబంధన్ పథకం కింద పెట్టి కేవలం రూ.98కోట్లు మంజూరు చేయించారు. నిధులు సగానికిపైగా తగ్గిపోవడంతో పూర్తిగా డిజైన్ మార్చేసింది.

930 మీటర్లు మాత్రమే..

గతంలో 1.46 కిలోమీటర్ల బ్రిడ్జి నిర్మించాలని డిజైన్‌లో ఉంటే ప్రస్తుత డిజైన్ లోమాత్రం కేవలం 930 మీటర్ల దూరం ఉండేలా డిజైన్ చేశారు. దీంతోపాటు గతంలో ఆరులైన్ల డిజైన్ ఉంటే ప్రస్తుతం నాలుగు లైన్ల డిజైన్‌గా మార్చేశారు. పాత డిజైన్ లో ఆర్‌ఓబి తోపాటు ఆర్‌యూబి. కూడా ఉంది. ఇప్పుడు డిజైన్ మారిపోవడంతో సర్వీస్ రోడ్లు కూడా చిన్నవిగా డిజైన్ చేశారు. కొత్త డిజైన్‌ను ప్రజలు, వ్యాపారస్తులు, మేధావులు వ్యతిరేకిస్తున్నారు. రాజధానికి వెళ్లే బ్రిడ్జి మరో 50ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఉండాలే తప్ప మాకు వచ్చిన నిధులతోనే నిర్మిస్తాం ... సరిపెట్టుకోమంటే మంచి పద్ధతి కాదని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాత డిజైన్ ప్రకారమే నిర్మించాలి

కొత్త బ్రిడ్జి డిజైన్ పై నగరవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు కోరుకున్నట్లు హిందూ కాలేజీనుంచి అంబేద్కర్ సెంటర్ వరకూ ఫ్లయ్ ఓవర్ నిర్మాణం చేపట్టాలి. మంజూరైన నిధులతోనే కొత్త డిజైన్ ప్రకారం బ్రిడ్జి నిర్మాణం చేస్తామని చెప్పడం సరికాదు. నగర ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని మేం ఉద్యమిస్తుంటే మాపై బురద జల్లాలని చూస్తున్నారు. నగర ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెట్టడాన్ని మేం అంగీకరించం. నగరంలోని 11 లక్షల జనాభా సౌకర్యార్థం బ్రిడ్జి డిజైన్‌లో సవరణలు కోరుతున్నాం నిధులు సరిపోకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అదనపు నిధులు సమీకరించి ఐకానిక్ బ్రిడ్జితోపాటు ఆర్‌యూబీ కూడా నిర్మించాలి.

– ఎల్ ఎస్ భారవి,
బెటర్ శంకర్‌విలాస్ ఫ్లయ్ ఓవర్ జేఏసీ

ఆర్‌యూబీకి అవకాశమున్నా.. దృష్టిపెట్టని వైనం

మొదట హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకు ఐకానిక్ ఫ్లయ్ ఓవర్, కింద ఆర్‌యూబీ, సర్వీసు రోడ్లు కనీసం 30 అడుగుల వెడల్పుతో ఉండేలా డిజైన్ చేశారు. 2018లోనే ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.167 కోట్ల అంచనా వేశారు. ఇప్పుడు ఆ అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే దీన్ని కేంద్రమంత్రితో సేతుబంధన్ ప్రాజెక్టు కింద ఆమోదింపచేయడంతో కేవలం రూ. 98 కోట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. ఫ్లయ్ ఓవర్ కాస్తా బ్రిడ్జిగా మారిపోయింది. ఆర్‌యూబీ కూడా సాంకేతికంగా సాధ్యం కాదని చెబుతున్నారు. వాస్తవానికి అధికారపార్టీ చెబుతున్న వాదనలో వాస్తవం లేదు. విజయవాడ సింగ్ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఫ్లయ్ ఓవర్ ఉన్న చోట కూడా తర్వాత అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆర్‌యూబీలను మంజూరు చేశారు. రోజుకు కనీసం లక్ష వాహనాలు శంకర్‌విలాస్ బ్రిడ్జిపై నడుస్తాయని ఆరేళ్ల క్రితం చేసిన ట్రాఫిక్ స్టడీలోనే తేలింది. ఫ్లయ్ ఓవర్‌ను మంజూరు చేయించాల్సిన చోట తక్కువ బడ్జెట్‌లో బ్రిడ్జిని మంజూరు చేయించి, ఇప్పుడు తాము చెప్పినట్లే అందరూ వినాలనే ధోరణిలో వారు ఉన్నారు.

భావన్నారాయణ స్వామి దేవాలయం వారసత్వ బైలాస్‌కు శ్రీకారం



దేవాలయంలో ఇంటాక్ బృందం సభ్యులు

బాపట్ల: శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం దేవాలయ కట్టడాల పరిరక్షణకు అవసరమైన వారసత్వ బైలాస్ రూపొందిస్తున్నామని 'ఇంటాక్,' (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) జాతీయ వారసత్వ డైరెక్టర్ ఎ.విజయ చెప్పారు. గురువారం ఢిల్లీ నుంచి వచ్చిన ఇంటాక్ బృందం దేవాలయాన్ని సందర్శించింది. ఇటువంటి చారిత్రక దేవాలయాల అద్భుత వారసత్వాన్ని కొనసాగించేందుకు ఆర్కిలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా వారితో కలిసి కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. దేవాలయం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఉన్న పలు వారసత్వ కట్టడాలను వారు సందర్శించారు. ఇందులో భాగంగా శ్రీపాద, నోరి, కంభంపాటి, దేశరాజు వారి భవనాలను వారు పరిశీలించారు. దేవాలయంతో పాటు, మిగతావాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆమె వివరించారు. ఇంటాక్ బృందంలో విజయతో పాటు, ఆర్కిటెక్ కన్జర్వేషనిస్ట్ దీప్తి శర్మ, ఇంటాక్ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఆర్కిలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాకు చెందిన డి.ఫణీంద్రలు ఉన్నారు. వారికి ఇంటాక్ బాపట్ల జిల్లా కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు స్వాగతం పలికారు. బృందం సభ్యులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఫోరం సభ్యులు జి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, దేవాలయ వంశపారంపర్య ధర్మకర్త దేశిరాజు రమణబాబు, శ్రీరామచంద్రమూర్తి, ఉమాదేవి, రాజేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా..వదలదయ్యా

- దోమకాటు ద్వారా వ్యాధి వ్యాప్తి
- అవగాహనతో మలేరియా బారిన పడకుండా కాపాడుకోవచ్చు
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

గుంటూరు మెడికల్: మలేరియా ఈ పేరు చెబితేనే గ్రామాల్లో చాలా మంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే కారణం. వ్యాధి సోకిదంటే ఒక పట్టాన త్వరగా శరీరాన్ని వదిలిపోదు. మలేరియా వ్యాధి సోకి అనేక మంది చనిపోతున్నారు. వ్యాధి బారిన పడకుండా మలేరియా పై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 2007లో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ ఏప్రిల్ 25 వ తేదీని వరల్డ్ మలేరియా డే గా నిర్ధారించింది. 2007 నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 25న దీనిని నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మలేరియా లక్షణాలు...

ఈ వ్యాధి అనాఫిలిస్ దోమకాటు వల్ల వస్తోంది. చలి,వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్ళునొప్పులు, మూత్రం మందగించటం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం మూడు రోజులకొకసారి లేదా రెండు రోజులకొకసారి లేదా రోజు మార్చి రోజు వస్తూ ఉండటం ఈ వ్యాధి లక్షణాలు. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయని పక్షంలో నెలల తరబడి వ్యాధి పీడిస్తోంది. కొందరిలో సెరిబ్రల్ మలేరియా, వైవ్యాక్స్ మలేరియాలు కూడా వస్తాయి. ఈ వ్యాధులు సోకిన వారిలో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవటం, కామెర్లు పెరిగిపోవటం, నిమోనియా, ఫిట్స్, మూత్రపిండాలు చెడిపోవటం, స్పృహకోల్పోవడం జరుగుతుంది. ఈ వ్యాధి మలేరియా ఉన్న వ్యక్తి రక్తం ఎక్కించటం ద్వారా, మలేరియా వ్యాధి ఉన్న వ్యక్తిని కుట్టిన దోమ మనల్ని కుట్టటం ద్వారా సోకుతోంది.



మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసే పోస్టర్

నిర్ధారణ....

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. రక్తపు పూతలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే క్లోరోక్విన్, ప్రై మాక్విన్ అనే మాత్రలను ఇస్తారు. ఇవి 14 రోజులు ఆపకుండా తప్పని సరిగా వాడాలి. ఈ మందులన్నీ కూడా ఉచితంగానే అందిస్తారు. కొన్ని సందర్భాల్లో వైద్య సిబ్బంది ఇళ్ళకు వెళ్లి రక్తపు పూతలు సేకరిస్తారు. పూర్వం కేవలం ఐదు రోజుల మందులు వాడితే సరిపోయేది. కాని న్యూడ్రగ్ పాలసీ–2012 ప్రకారం తప్పని సరిగా 14 రోజులు వాడాలి.



దోమల నివారణ చర్యలు చేపడుతున్న వైద్య సిబ్బంది, అధికారులు (ఫైల్)

జిల్లాలో నమోదైన కేసులు

జిల్లా వ్యాప్తంగా 2021లో 2,06,359 మందికి రక్త పరీక్షలు చేయగా, 15 మందికి మలేరియా సోకినట్లు నిర్ధారణ జరిగింది. 2022లో 2,27,905 రక్త నమూనాలు పరీక్షలు చేయగా 24 మందికి మలేరియా సోకినట్లు నిర్ధారణ అయింది. 2023లో 3,82,551 మందికి రక్త పరీక్షలు చేయగా, 21 మందికి మలేరియా సోకినట్లు నిర్ధారణ అయింది. 2024లో 3,52,748 మందికి రక్త పరీక్షలు చేయగా, వీరిలో పది మందికి మలేరియా సోకినట్లు నిర్ధారణ అయింది. 2025 మార్చి వరకు 1,08,880 మందికి రక్త పరీక్షలు చేయగా, ఒకరికి మలేరియా సోకినట్లు నిర్ధారణ అయింది. ఐదేళ్లలో జిల్లాలో మలేరియా మరణాలు ఒక్కటి కూడా సంభవించలేదు.

ప్రతి ఒక్కరూ సహకారం అందించాలి



మలేరియా వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలి. కేసులు నమోదైన గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్, పైరిత్రమ్ స్ప్రే చేయించాం. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నాం.

– టీ.ఎం.కె.సుబ్బరాయణం, జిల్లా మలేరియా అధికారి

దోమ కాటు బారిన పడకుండా జాగ్రత్తలు



దోమ కాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, ఇతర జ్వరాలకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. దోమల ద్వారా మలేరియా సోకుతుంది కాబట్టి ఇంటి పరిసరాలలో దోమలు పెరిగేందుకు ఆస్కారం లేకుండా మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వారానికి ఒకసారి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా డ్రై డే పాటించాలి.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ప్రాణం తీసిన ఈత సరదా

- నేల బావిలో ఈతకు దిగి ఇద్దరు విద్యార్థులు మృతి
- మాచవరం మండలం కొత్తపాలెంలో ఘటన



చిన్నారుల మృతదేహాలు



యశ్వంత్ (ఫైల్)



యేసురాజు (ఫైల్)

మాచవరం: వేసవి సెలవులు కావడంతో సరదాగా ఈతకు వెళ్లి నేల బావిలో కూరుకుపోయి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన ఘటన మాచవరం మండలంలోని కొత్తపాలెం గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వేమవరపు శ్రీను కుమారుడు జస్వంత్ (9) స్థానిక దళితవాడలోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. పప్పుల ఏసయ్య కుమారుడు యేసురాజు (16) మాచవరం జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఇరువురు మధ్యాహ్న సమయంలో సైకిల్ పై గ్రామ సమీపంలోని శివాలయం పక్కనే ఉన్న పెద్దబావి వద్దకు వచ్చి, దుస్తులు విడిచి ఈత కొట్టేందుకు బావిలోకి దూకారు. బావి లోతు ఎక్కువగా ఉండడంతో ఊపిరి ఆడక చనిపోయారు. కొంత సమయం తర్వాత గ్రామానికి చెందిన ఓ యువకుడు ఈత కొట్టేందుకు బావిలోకి దూకాడు. బావి అడుగు భాగాన ఇద్దరు చిన్నారులు మృతి చెందడాన్ని గమనించి, విషయాన్ని గ్రామస్తులకు తెలియజేసాడు. అప్పటికే చిన్నారులు కనిపించకపోవడంతో గ్రామంలో వెతుకుతున్న తల్లిదండ్రులకు విషయం తెలిసి ఘటనా స్థలానికి వచ్చి చూడగా దుస్తులు, సైకిల్‌ను గుర్తించి బోరున విలపించారు. గ్రామస్తుల సహాయంతో ఇద్దరు చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. మృత దేహాలను చూసిన తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గురజాల ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ సాయి కర్ణకుమార్ ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ విజయ్ శేఖర్ తెలిపారు.

ముగిసిన సలహా మండలి సమావేశం

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందు గత రెండు రోజులుగా జరుగుతున్న వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం గురువారంతో ముగిసింది. సమావేశంలో ఆయా పంటల ప్రధాన శాస్త్రవేత్తలు పంటల్లో పరిశోధనలు, సాధించిన ప్రగతి, నూతన టెక్నాలజీ, మినీకిట్లు వంటి అంశాలపై చర్చించి సమాచారాన్ని అందించారు. యాంత్రీకరణపై శాస్త్రవేత్తలతో ప్రత్యేక చర్చా కార్యక్రమం, గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. వరి పంటలో బీపీటీ 5204 నాణ్యత కలిగిన సన్నగింజ రకాలు ఎగుమతికి అనువైనవని, 7 మిల్లీ మీటర్ల గింజ పొడవుగల వరి రకాలు, కలర్డ్ వరి రకాలపై పరిశోధనలు చేయాలని, అధిక దిగుబడిని ఇచ్చే తక్కువ ఎత్తుగల మొక్క జొన్న, జొన్న, హైబ్రిడ్స్ అపరాలలో కలుపు యాజమాన్యం, శనగలో పోస్ట్ ఎమర్జెన్స్ కలుపు మందులు, కాండం తొలిచే పురుగులు, గజ్జి తెగులు యాజమాన్యం, తెగుళ్లను తట్టుకునే మినుము రకాలపై పరిశోధనలు చేపట్టాలని పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. పత్తిలో గులాబీ రంగు పురుగు యాజమాన్యంపై, ట్రాష్ షెడ్డర్ ద్వారా పంట వ్యర్థాల వినియోగం వటి అంశాలపై రైతులకు అవగాహన పెంచాలని విస్తరణ సంచాలకులు డాక్టర్ జి. శివన్నారాయణ తెలిపారు. చెరకు విస్తీర్ణం క్రమేపీ తగ్గిపోతున్న సందర్భంగా డ్రయ్యర్‌లు రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. చెరకులో యాంత్రీకరణను పెంచి కూలీల ఖర్చు తగ్గించినపుడే పంటలో ఆశించిన లాభం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **7,400** గరిష్ఠం : రూ. **10,000**

మోడల్ ధర రూ. **8,600**

క్లుప్తంగా

యార్డులో 1,18,944 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,12,028 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,18,944 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.9,800 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,104 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: పసుపు యార్డులో 1,227 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 821, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,900. గరిష్ఠ ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,725. కాయలు 406, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,900. గరిష్ఠ ధర రూ.12,250, మోడల్ ధర రూ.11,725, మొత్తం 920.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.

వాహనాలకు భద్రత... జీపీఎస్

గుంటూరు నగరంలోని కొత్తపేటకు చెందిన ఒక యువకుడి ద్విచక్ర వాహనాన్ని ఇటీవల కాలంలో కొంత మంది ఆకతాయిలు తీసుకువెళ్ళారు. ఆ వాహనదారుడు ఇంట్లోకి వెళ్ళే సమయంలో తన బైక్‌కు తాళం వేయటం మరిచిపోయాడు. వాహనాన్ని తీసుకు వెళ్ళిన ఆకతాయిలు... వారికి కావాల్సినంత సేపు తిరిగి తిరిగి పొన్నూరు రోడ్డులో వదిలి వెళ్ళారు. అయితే సదరు యువకుడు మాత్రం ఎటువంటి కేసు పెట్టలేదు. అందుకు కారణం తన బైక్‌లో గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) ఉండటమేర్. చివరకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా తన వాహనం వదిలేసిన ప్రాంతానికి వెళ్లి తెచ్చుకున్నాడు.

పాత గుంటూరుకు చెందిన ఒక పురోహితుడు తన కారును వేరే వ్యక్తికి కొద్ది రోజులు వాడుకునేందుకు ఇచ్చాడు. అయితే కారు తీసుకున్న వ్యక్తి అసలు తనకు కారు ఇవ్వలేదని అడ్డం తిరిగాడు. ఇప్పటికీ ఆ కారు జాడ తెలియలేదు. రూ. 20లక్షలు విలువ చేసే కారుకు జీపీఎస్ లేకపోవటమే అందుకు కారణం. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ప్రతిఫలం కనపడలేదు.

- మన వాహనం ఎక్కడ ఉన్నా.. ఇట్టే తెలుసుకోవచ్చు
- ఎటువంటి భయం లేకుండా నిశ్చింతగా ఉండొచ్చు
- వాహనదారులకు ఎంతో మేలు చేకూర్చే జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్




జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్ పరికరాలు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ఎంతో ఉపయోగకరం. రూ.లక్షలు పెట్టి కార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ జీపీఎస్‌ను తప్పని సరిగా సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని పై రెండు ఉదాహరణలు రుజువు చేస్తున్నాయి. గుంటూరు నగరంలో సుమారు 1లక్ష 40వేల బైకులు, 40వేలకు పైగా కార్లు ఉన్నట్లు అధికారులు గణాంకాలు చెబుతున్నారు. అయితే ఎటువంటి చోరీ జరిగినా.. ఇంట్లో చిన్నారులు తెలియకుండా వాహనాన్ని తీసుకుని వెళ్ళినా.. ఫైనాన్స్ వారు తీసుకు పోయిన మన వాహన జాడ తెలుసుకునేందుకు ఎంతగానో ఉపయోగపడే పరికరం జీపీఎస్. ఈ పరికరాన్ని వాహనాలకు ఏర్పాటు చేస్తే.. దొంగల బారి నుంచి కాపాడుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని పోలీసులు సైతం సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో నివాసం ముందు పెట్టిన బైక్‌లు, ఆటోలు చోరికి గురౌతున్న పరిస్థితులు ఉన్నాయి.

ఎక్కడ ఉన్నా అరచేతిలోనే...

వాహనదారులు జీపీఎస్‌ను అమర్చటం ద్వారా సెల్‌ఫోన్‌లో వారి వాహనాన్ని గుర్తించే అవకాశం ఉంది. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం వాహనానికి అమర్చిన తరువాత మన సెల్‌ఫోన్‌కు యాప్ ద్వారా అనుసంధానం చేస్తారు. తద్వారా వాహనం ఏ రూటులో వెళ్తతోంది. ఎక్కడ దాకా వెళ్లింది, ఎటువంటి వైపు నుంచి వస్తోందో అనే సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. ఒకవేళ చోరికి పాల్పడిన వ్యక్తులైన జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌ను పసిగట్టలేని పరిస్థితి ఉంటుంది. వాహన అంతర్భాగంలో జీపీఎస్‌ను అమర్చబడుతుంది. తద్వారా చోరికి గురైన వాహనాన్ని కూడా ఇట్టే పట్టేయచ్చు.

ఎంతో మేలు చేకూరుస్తుంది...



వాహనాల్లో జీపీఎస్ ఏర్పాటు వల్ల యజమానికి ఎంతో మేలు చేకూస్తుంది. తద్వారా వాహనదారుడికి ఎనలేని భద్రత ఉంటుంది. నేరస్తులు తీసుకు వెళ్ళినా.. ఎక్కడైనా దాచిపెట్టినా.. వాహన కదలికలు మనకు తక్షణమే తెలిసిపోతాయి. ప్రతి వాహనానికి యజమానులు తప్పనిసరిగా జీపీఎస్ పరికరాన్ని అమర్చుకోల్సిన అవసరం ఉంది. మనకు తెలియకుండా ఎవరైనా వాహనం తీసిన వెంటనే సెల్‌ఫోన్‌కు మెసేజ్ రావటంతో పాటు, తక్షణమే మనం అప్రమత్తం అయ్యే అవకాశం ఉంటుంది. వాహనదారులు జీపీఎస్ అమర్చుకోవటం ద్వారా చోరీలను నియంత్రించే అవకాశం కూడా ఉంది.

– ఎం. రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్, గుంటూరు

రైతు శాస్త్రవేత్తలు, మెంటార్ ఇంటర్న్‌ల ఎంపిక

దరఖాస్తులు ఆహ్వానించిన జిల్లా వ్యవసాయ అధికారి

కొరిటిపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్, జర్మనీ ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ గ్రామాల రైతు సేవ కేంద్రాల పరిధిలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్ ఇంటర్న్‌ల ఎంపిక కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో కొల్లిపర, గుంటూరు రూరల్ మండలాల్లో మెంటార్ ఇంటర్న్‌లు ఉన్నారని పేర్కొన్నారు. పెద్ద కొండూరు (దుగ్గిరాల మండలం), చివలూరు (కొల్లిపర మండలం), ముట్లూరు (వట్టిచెరుకూరు మండలం), నారాకోడూరు (చేబ్రోలు మండలం)లో రైతు శాస్త్రవేత్తలు శిక్షణ పొందుతున్నారని వెల్లడించారు. మిగిలిన ప్రతి ప్రకృతి వ్యవసాయ మండలానికి ఒక మెంటార్ చొప్పున, ప్రకృతి వ్యవసాయ గ్రామంలో ఉన్న ప్రతి రైతు సేవా కేంద్రానికి ఒక రైతు శాస్త్రవేత్త చొప్పున దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోపు జిల్లా ప్రకృతి వ్యవసాయం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాలుగు సంవత్సరాల కోర్స్ కాలంలో వీరికి గౌరవ వేతనం ఇస్తామని తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డిగ్రీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హతలివీ...

రైతు శాస్త్రవేత్త కోర్సు ప్రవేశానికి విద్యార్హత ఇంటర్మీడియట్ లేదా అంతకంటే ఎక్కువ, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, హార్టికల్చర్ చదివి ఉండాలన్నారు. అభ్యర్థి సంబంధిత ఆర్ఎస్‌కేకి చెంది ఉండాలన్నారు. మూడు సంవత్సరాలు ప్రకృతి వ్యవసాయం చేసి ఉండాలన్నారు. మెంటార్ ఇంటర్న్ ఎంపికకు ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువ చదివి ఉండాలన్నారు. రైతు శాస్త్రవేత్త పోస్టుకు సొంత భూమి కలిగి ఉండాలని, లేని పక్షంలో సుమారు 1.20 ఎకరాలు కౌలుకు తీసుకొని ఉండాలని వెల్లడించారు. మెంటార్ ఇంటర్న్ పోస్టుకు సొంత భూమి కలిగి ఉండాలని, భూమి లేని వారు నాలుగు సంవత్సరాల పాటు లీజుకు తీసుకున్న భూమి ఉండాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడానికి జీవిత భాగస్వామి లేదా కుటుంబం తప్పని సరిగా మద్దతు ఇవ్వాలని ఆయన వివరించారు. వయస్సు 25 - 35 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాల సడలింపు ఉంటుందని చెప్పారు. వివరాలకు 70958 81347 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

ఆసుపత్రులకు ఫైర్ నిబంధనలను సవరించండి

ఫైర్ డీజీకి ఐఎంఏ విజ్ఞప్తి

గుంటూరు మెడికల్: రాష్ట్రంలో క్లినిక్స్, చిన్న, మధ్య తరహా ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ విషయంలో ఫైర్ ఎన్ఓసీ చాలా సమస్యగా ఉందని, ఫైర్ నిబంధనలను కొన్ని సవరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌ను కోరింది. విజయవాడలోని ఫైర్ సర్వీసెస్ కార్యాలయంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ ఆధ్వర్యంలో గురువారం మాదిరెడ్డి ప్రతాప్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 'నేషనల్ ఫైర్ సేఫ్టీ వీక్' సందర్భంగా ఐఎంఏ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులకు జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జి. నందకిషోర్, ఐఎంఏ ఫైర్ సేఫ్టీ కమిటీ చైర్మన్ డాక్టర్ సి.శ్రీనివాస రాజు, ఫైర్ ఎన్ఓసీ విషయంలో ఎదురవుతున్న సమస్యలను డీజీ దృష్టికి తీసుకువెళ్లారు. క్లినిక్స్, చిన్న, మధ్య తరహా ఆసుపత్రిలో కూడా భారీ అగ్నిమాపక పరికరాలు అమర్చుకోవాలనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. వీటివల్ల ఆర్థిక భారం తప్ప ఏమాత్రం ప్రయోజనం లేదన్నారు. డీజీ ఫైర్ సర్వీసెస్ ,మాదిరెడ్డి ప్రతాప్ మాట్లాడుతూ వైద్యులు ఫైర్ ఎన్ ఓసీ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలన్నిటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తప్పక కృషి చేస్తానన్నారు. డీజీని కలిసిన వారిలో ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మోటూరు సుభాష్ చంద్రబోస్, ఐఎంఏజాతీయ యాక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ పి. ఫణిధర్, కోశాధికారి డాక్టర్ టి.కార్తీక్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవకుమార్, డాక్టర్ డి.అమరలింగేశ్వర రావు తదితరులు ఉన్నారు.



డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌కు సమస్య తెలియజేస్తున్న జి.నందకిషోర్, టి.సేవకుమార్, ఐఎంఏ సభ్యులు

సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి ప్రభుత్వంతో ఒప్పందం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి గురువారం ఒప్పందం జరిగింది. డీఎంఈ డాక్టర్ నరసింహం భవన నిర్మాణ దాత ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు తనయుడు తులసి యోగీష్ చంద్రతో ఒప్పందం చేసుకున్నారు. విజయవాడ డీఎంఈ కార్యాలయంలో గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరు జీజీహెచ్ హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు రూ. పది కోట్ల వ్యయంతో సర్వీస్ బ్లాక్ నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు ముందుకు వచ్చారు.

జనవరిలో జీవో విడుదల

సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తి చేసేందుకు తులసి రామచంద్ర ప్రభుకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జనవరిలో జీవో నెంబర్ 11 ప్రభుత్వం రిలీజ్ చేసింది. దీనికి సంబంధించి అన్ని అనుమతులు పూర్తి చేసుకొని గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డి ఎస్ వి ఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర విజయవాడ డీఎంఈ కార్యాలయంలో ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. సర్వీస్ బ్లాకు నిర్మాణ కార్యక్రమాలు వెంటనే మొదలు పెడతామని యోగీష్ చంద్ర తెలిపారు. భవన నిర్మాణం 18 నెలల్లోగా పూర్తి చేసి అందిస్తామన్నారు. ఈసందర్భంగా యోగీష్ చంద్రను డీఎంఈ డాక్టర్ నరసింహం, డాక్టర్ యశశ్వి రమణ సన్మానించారు. కార్యక్రమంలో గుంటూరు జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, వివేక్ పాల్గొన్నారు.



యోగీష్ చంద్రను సన్మానిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం, డాక్టర్ యశశ్వి రమణ

గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారు

- 27న విజయవాడలో రాష్ట్రస్థాయి పునర్వికాస సదస్సు
- పోస్టర్ ఆవిష్కరించిన ఉద్యమ నేతలు

తెనాలి: విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఈనెల 27వ తేదీన జరగనున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస సదస్సును మేధావులు, సాహితీ వేత్తలు, ప్రజాఉద్యమ నాయకులు జయప్రదం చేయాలని 'అరసం' జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ కోరారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇక్కడి 'ఇస్కఫ్' కార్యాలయంలో జరిగిన సమావేశంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో గ్రంథాలయాలు పూర్వవైభవం సంతరించుకునే ఉద్యమంలో ప్రతిఒకరూ పాలుపంచుకోవాలని సూచించారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమలి సింగారావు అధ్యక్షత వహించారు. ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకులు గ్రంథాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. దక్షిణాదిలోని రాష్ట్రాలు గ్రంథాలయాల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుంటే, తెలుగు రాష్ట్రాల్లో అందుకు భిన్నంగా జీర్ణావస్థలో ఉండటం శోచనీయమన్నారు. రాష్ట్రంలో ఉన్నవి 1400 మాత్రమేనని, అవీ దీనావస్థలో ఉన్నాయన్నారు. ప్రజాసాహితీ సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా వ్యవస్థ వచ్చాక పాఠశాలల్లో గ్రంథాలయాలు అదృశ్యమైనట్టు చెప్పారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పెనుగొండ, శివప్రసాద్, రవిబాబు తదితరులు

వైద్య కళాశాలలో వెల్‌నెస్ క్లీనిక్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో ఫిజియాలజీ విభాగం వద్ద గురువారం వెల్‌నెస్ క్లీనిక్‌ను ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్, సీనియర్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ దేవన బోయిన శౌరిరాజునాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి వెల్‌నెస్ క్లీనిక్‌ను ప్రారంభించారు. వైద్య కళాశాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అభినందించారు. కళాశాల అభివృద్ధికి డాక్టర్ సుందరాచారీ చేస్తున్న కృషిని కొనియాడారు. కళాశాలలో వైద్యులు, వైద్య సిబ్బందికి పలు రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు ఉచితంగా అందించేందుకు వెల్‌నెస్ క్లీనిక్ ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ తెలిపారు. ప్రతిరోజూ పీజీ వైద్యులు వెల్‌నెస్ క్లీనిక్‌లో అందుబాటులో ఉండి సేవలందిస్తారన్నారు. ఉచిత క్లీనిక్ సేవలను కళాశాల సిబ్బంది వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రాజునాయుడు, పక్కన డాక్టర్ సుందరాచారి, డాక్టర్ ప్రభాకర్

గంజాయితో పట్టుబడిన ఇద్దరు యువకులు

సుమారు 300 గ్రాముల గంజాయి స్వాధీనం

మంగళగిరి టౌన్ : మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో ఇద్దరు యువకులు గంజాయి కలిగి ఉన్నారని సమాచారం రావడంతో గురువారం 'ఈగల్' టీమ్ పట్టణ పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకున్నారు. ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ ఆదేశాల మేరకు ఈగల్‌టీమ్ గురువారం మధ్యాహ్నం ఆ యువకులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు 200 నుంచి 300 గ్రాముల వరకు గంజాయిని, గంజాయిని వినియోగించే త్రెస్ అనే పేరు కలిగిన రోల్స్‌ను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ యువకుల్ని విచారించగా మంగళగిరిలో ఓ యువకుడి వద్ద కొన్నామని, అతని వద్ద సుమారు 4 కిలోల వరకు గంజాయి ఉందనే సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.



యువకుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి, రోల్స్

26 నుంచి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు



రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎద్దుల బండలాగుడు బల ప్రదర్శన పోటీలు ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్ రెడ్డి తెలిపారు. గురువారం రెంటచింతలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సూర్యపేట మండలం మఠంపల్లి గ్రామంలో 25వ తేదిన జరిగే శుభవార్త దేవాలయ తిరునాళ్ల సందర్భంగా మాంట్ ఫోర్ట్ స్కూల్ (బ్రదర్స్ స్కూల్) ఆవరణలలో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 25వ తేదీలోపు పేరు నమోదు చేసుకుని ఎంట్రీ ఫీజు రూ. 1000 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 96187 64924, 99896 96953, 99497 62633 ఫోను నంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో యువజన సంఘం సభ్యులు గాదె పవన్‌రెడ్డి, తానం బాలరెడ్డి, కందుల కిరణ్ కుమార్‌రెడ్డి, సలిబండ్ల రాజేష్‌రెడ్డి, కొమ్మారెడ్డి రంజిత్‌రెడ్డి, గోపు అఖిల్‌రెడ్డి, గాదె మనీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

డీఈఓ చంద్రకళ

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో చేరేందుకు అర్హులైన పేదలకు 25 శాతం సీట్లు కేటాయించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వి.సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన చిన్నారుల తల్లిదండ్రులు ఈనెల 28 నుంచి మే నెల 15వతేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను http://creapgov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని వివరించారు. వివరాలకు ఆయా మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో డిఈఓ కార్యాలయంలో నోడల్ అధికారిగా సిఎంఓ పి.పద్మారావు, హెల్ప్ డెస్క్‌లో ఏపీఓ శంకరరాజును నియమించినట్లు తెలిపారు. వివరాలకు 4849851047, 9963192485 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోటిరెడ్డి

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన తియ్యగూర కోటిరెడ్డిని గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షుడిగా సాదం

పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన సాదం వెంకటసత్యనారాయణను పార్టీ జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ విభాగం అధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వైద్య కళాశాలలో స్పోర్ట్స్ డే



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో వైద్య విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు స్పోర్ట్స్ డే సందర్భంగా గురువారం పలు క్రీడలను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారీ లాంచనంగా ప్రారంభించారు. వారం రోజులపాటు జరుగనున్న క్రీడల్లో క్రికెట్, షటిల్, చెస్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్ జరుగనున్నాయి. ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్యార్థులకు క్రీడలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, స్పోర్ట్స్ పీఈటీ రాము, డాక్టర్‌భరత్, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

గుంటూరు లీగల్: చందోలు పోలీసులు 2017లో నమోదు చేసిన కేసులో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు 1వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వి.ఎ.ఎల్. ఔ. సత్యవతి బుధవారం తీర్పు వెలువరించారు. బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.కోటేశ్వరరావుకు చందోలు గ్రామం రసూల్ పేటలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేశారు. గంజాయి విక్రయిస్తున్న షైక్ నజీర్ బాషా, కొనుగోలు చేస్తున్న చుండూరు మండలం దుండిపాలెంకు చెందిన మారెడ్డి రోహిత్ కుమార్ రెడ్డిని అరెస్ట్ చేశారు. 520 గ్రాముల గంజాయి, రూ. వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. నజీర్ బాషా ప్రకాశం జిల్లా తిమ్మా సముద్రానికి చెందిన కర్ణం సుబ్బారావు వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తేలడంతో సుబ్బారావు నుంచి 4,050 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. తర్వాత అతడిని అరెస్ట్ చేశారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, విచారణ పూర్తిచేసి నిందితులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వజ్రాల రాజశేఖర్ రెడ్డి వాదనలు వినిపించారు.

రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భట్టిప్రోలు వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా అద్దేపల్లి గ్రామానికి చెందిన కనపర్తి సందీప్(19) ఐటీఐ చదువుతున్నాడు. బుధవారం రాత్రి భట్టిప్రోలు సమీపంలో రేపల్లె నుంచి కాచిగూడ వెళుతున్న డెల్టా ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని గురువారం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. పోస్టమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్టు తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని జీఆర్పీ ఎస్ఐ జి. వెంకటాద్రి తెలిపారు.

కళ్లల్లో కారం కొట్టి చైన్ స్నాచింగ్

మంగళగిరి టౌన్ : ఇంట్లో ఒంటరిగా ఉంటున్న ఓ వృద్ధురాలి కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును దోచుకు వెళ్లిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం మంగళగిరి నగర పరిధిలోని రత్నాల చెరువు వద్ద సరోజని అనే వృద్ధురాలు ఒంటరిగా జీవనం సాగిస్తోంది. బుధవారం రాత్రి ఇంట్లో అన్నం తింటుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి వచ్చి కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసును లాక్కుని పారిపోయాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో పక్కన నివాసముంటున్న వారు అక్కడకు చేరుకునే సరికి ఆ వ్యక్తి పారిపోయాడు. కాసేపటికి తేరుకున్న ఆమె మంగళగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంగారం గొలుసు సుమారు 18 గ్రాములు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది.